క్లుప్తంగా

ఘనంగా ఇరుముడి పూజ



ఇరుముడులతో శబరిమలకు బయలుదేరుతున్న భక్తులు

మొయినాబాద్: అయ్యప్ప మాలధారణతో 41 రోజులపాటు దీక్ష చేసిన భక్తులు శబరిమలకు బయలుదేరారు. మండల పరిధిలోని సురంగల్ హనుమాన్ దేవాలయంలో మంగళవారం గురుస్వాములు నిర్దుల ఇంద్రారెడ్డి, రంగారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారి మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు రాంచందర్, శేఖర్ పూజలు నిర్వహించి ఇరుముడులు కట్టారు. అనంతరం ఇరుముళ్లను తలపై పెట్టుకుని అయ్యప్ప భక్తులు శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో గురుస్వాములు మహేందర్‌రెడ్డి,యాదయ్య,జైపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం వెంకట్‌రెడ్డి, ఈగ రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, భాస్కరాచారి, విక్రంరెడ్డి, ప్రభుయాదవ్, సీతారాంరెడ్డి, కృష్ణారెడ్డి, గౌతంరెడ్డి, నర్సింహ్మాగౌడ్, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

కొందుర్గు: బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మీకాంత్‌రెడ్డి మంగళవారం వేర్వేరు ప్రకటనలలో ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి కార్యాలయంపై రాళ్లు రువ్వడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రౌడీయిజాన్ని తలపించేలా ఇలాంటి చర్యలకు పాల్పడం సిగ్గుచేటన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నందిగామ: బీజేపీ రాష్ట్ర కార్యాలయం శ్యాంప్రసాద్ ముఖర్జీ భవనంపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన కొనసాగిస్తున్నామని గొప్పలు చెప్పుకుని తిరిగే పాలకులు రౌడీపాలన చేస్తున్నారా అని విమర్శించారు. ఎన్నికలకు ముందు అనేక హామీలను ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా, ప్రశ్నిస్తే దాడులు చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ గ్రామ నాయకులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అడిగిన వెంటనే స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి గ్రామంలో లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసురెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాకేశ్, రవి, నర్సింలు, ఈశ్వరయ్య, శ్యామ్‌సుందర్, రాములు, జంగయ్య, గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

జీహెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్సింలు



ఉపాధ్యాయులకు సర్వీస్ పుస్తకాలు అందజేస్తున్న నర్సింలు

మొయినాబాద్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, ఎక్కడ పనిచేసిన చిరస్థాయిగా గుర్తుండే విధంగా సేవలు అందించాలని జీహెచ్‌ఎం అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నర్సింలు అన్నారు. పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో చిలుకూరు ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా చేరిన డీఎస్సీ 2024 ఉపాధ్యాయులకు మంగళవారం సర్వీస్ పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనంగా సర్వీస్ పుస్తకం నిలుస్తుందన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఉద్యోగ విరమణ పొందే వరకు ఎలా పనిచేశారనే విషయాలన్నీ సర్వీస్ పుస్తకంలో నమోదవుతాయన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, పండిత్ పరిషత్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం భీమయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వేణు, మండల కార్యదర్శి మహేందర్, ఉపాధ్యాయులు కిరణ్, ఉమాదేవి, రమాదేవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- నేటి నుంచి శుద్ధ వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు
- మొదటిరోజు సంతానం లేనివారికి గరుడ ప్రసాదం
- 10వ తేదీన స్వామివారి ఉత్తర ద్వార దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం



కొలువైన స్వామివారు

మొయినాబాద్‌రూరల్: భక్తుల కోరికలు తీర్చే వేంకటేశ్వరస్వామి దేవాలయం వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాలను ఈ నెల 8 నుంచి 10వ తేదీవరకు మూడురోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హైదరాబాద్–బీజాపూర్ పక్కన గల శ్రీదేవి, భూదేవి సమేత కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు నిర్వాహకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలకు గాను ఆలయాన్ని వివిధ రంగులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర ద్వార దర్శనానికి జంట నగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తుండడంతో పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ సభ్యులు కృషి చేస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు..

వేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ తేదీన ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో ప్రారంభమై 5 గంటలకు స్వామివారి పల్లకీసేవ, 8 గంటలకు అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. 9వ తేదీన శుద్ధదశమి గురువారం సుప్రభాతంతో కల్యాణం, అన్నప్రసాద వితరణ, లక్ష పుష్పార్చన, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10వ తేదీన శుద్ధ వైకుంఠ ఏకాదశి శుక్రవారం వైకుంఠ ద్వారం, ప్రముఖులతో భగవద్గీత పారాయణం, హనుమాన్ చాలీసా, ధ్వజారోహణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

సంతానం లేని వారికి గరుడ ప్రసాదం..

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు 8వ తేదీన బుధవారం ఉదయం 10 గంటలకు సంతానం లేని మహిళలకు గరుడ ప్రసాదం ఇవ్వబడుతుందని ఆలయ అర్చకుడు తెలిపారు. భక్తులు దీనిలో ఎలాంటి సందేహాలు లేకుండా స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని సూచించారు. వైకుంఠ ద్వార దర్శనం ఉత్తర ద్వార దర్శనం భక్తులకు కొంగుబంగారం అని సూచించారు. ఈ దేవాలయానికి వచ్చే భక్తులందరికీ ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ద్వారా ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు పాల్గొని వైకుంఠ ద్వారా దర్శనం విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

- భయాందోళనకు గురవుతున్న వాహనదారులు, ప్రజలు



రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

నందిగామ: మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో రోడ్డుకు ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌తో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా వచ్చినట్లయితే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. దానికి అతి సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. పిల్లలు ఆడుకుంటూ రోడ్డుపైకి వచ్చినట్లయితే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న టీచర్లు, నాయకులు

కొందుర్గు: అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్‌కు అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు ప్రతి నెల క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించాలన్నారు. 50 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలన్నారు. కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గ్యాస్ బిల్లు, కూరగాయల డబ్బులు ఇవ్వాలని కోరారు. లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బాగ్లొ నర్సింహ, అంగన్‌వాడీల సంఘం మండలాధ్యక్షురాలు యామిని, నాయకులు మనెమ్మ, శ్రీలత, ప్రమీల, రమాదేవి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే

మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్



జెర్సీలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్

షాద్‌నగర్: యువత ఉన్నత చదువులతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. కొందుర్గు ప్రీమియర్ క్రికెట్ లీగ్ క్రీడాకారులకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆర్థిక సహాయంతో అందించిన జెర్సీలను మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో మంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారందరూ తమకు నచ్చిన క్రీడల్లో ప్రతిభను చూపించి రాణించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శరీరం ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని, దృఢంగా ఉంటుందన్నారు. క్రీడాకారులు తమ స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, నాయకులు రాజేశ్ పటేల్, గోపాల్, జగదీశ్వర్‌గౌడ్, కంది రాఘవేందర్‌గౌడ్, చీపిరి సాయి యాదవ్, గుడ్డు యాదవ్, కాట్న ఆంజనేయులు, నవీన్, సాయి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- పట్టణ సీఐ విజయ్‌కుమార్



దాతలను సన్మానిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పట్టణ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మాజీ ఉపసర్పంచ్ సింగారం సుదర్శన్ కోరిక మేరకు సీనియర్ జర్నలిస్టు గణేశ్ మిత్రబృందం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజిపల్లి గ్రామంలో గల దేవాలయం వద్ద రూ.38వేలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సీసీ కెమెరాలను మంగళవారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు తమవంతు సహాయసహకారాలను అందించాలన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన సీనియర్ జర్నలిస్టు గణేశ్, పెంటారెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ బలరాం, నాయకులు ప్రవీణ్‌కుమార్, నవీన్‌కుమార్, శ్రీనివాస్, రామప్ప, శశిధర్, ప్రశాంత్, ప్రభాకర్, శంకర్, రాములు, మల్లేశ్, అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యనందించేందుకు కృషి

- ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి



కంప్యూటర్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, తదితరులు

మొయినాబాద్‌రూరల్: నాణ్యమైన విద్య అందించడంలో భాగంగా చెవిటి, మూగవారి కోసం కంప్యూటర్ లాంగ్వేజ్ చేతి సైగలతో నూతన విద్యాభ్యాసాన్ని నిర్వహిస్తున్నట్లు జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభ కోసం చెవిటి, మూగ వారిని ప్రత్యేకంగా గుర్తిస్తూ వారికి అర్థమయ్యే విధంగా లాంగ్వేజ్ సైగలతో కంప్యూటర్‌లో పదాలు టైప్ కావడం ప్రాజెక్టు ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యాసంస్థల్లో విద్యార్థులు వేల మంది చదువుతున్నారని, అందులో కొందరు మూగ, చెవిటి వారు ఉండడంతో పాటు వారికి ప్రత్యేకంగా ఉన్నత విద్యను అందించడానికి కళాశాల యాజమాన్యం కృషి చేస్తుందన్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా కంప్యూటర్‌లో పదాలుగా మార్చి ఉంచడం, సరికొత్త ఆవిష్కరణతో ప్రాజెక్టు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ప్రభాకర్, కో–ఆర్డినేటర్ అంజలి, అబ్దుల్ రహీం, డాక్టర్ ఎల్.వీ.రెడ్డి, పి.వై.రమేశ్, కెనడి బాబు,శేషగిరి, ప్రసాద్, అరుణ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఉపాధ్యాయ సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, సంఘం నాయకులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కాలె యాదయ్య నివాసంలో ఆయన చేతుల మీదుగా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) జిల్లా కేలండర్‌ను ఆ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు రాబడితే ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందుతారన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీటీఏ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్, జిల్లా మహిళా కార్యదర్శి టి.సునీత, ఆర్గనైజింగ్ కార్యదర్శి బి.వీరన్న, జిల్లా బాధ్యులు జి.వెంకటరమణ, కుమార్ పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు పేదరికాన్ని జయించి ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే తన సొంత నిధులతో 800 మంది విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చదువుకు పేదరికం అడ్డుకాదని, విద్యార్థులు పేదరికాన్ని అధికమించి ఉన్నత చదువుల్లో రాణించాలని సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని, తద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. తాను చిన్నప్పుడు ఈ కళాశాలలో చదివానని, పేదింటి నుంచి వచ్చిన తాను ఏ అవసరం వచ్చినా ఎవరి వద్ద కూడా చేయిచాచలేదన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయొద్దన్నారు. విద్యార్థులు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తినాలని, ఇందులో భాగంగానే సొంత నిధులతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. దాతల సహకారంతో నూతన కళాశాలను నిర్మిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, రఘు, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, పురుషోత్తంరెడ్డి, దామోదర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, కొమ్ము కృష్ణ, బస్వం,శ్రావణి,జమృద్‌ఖాన్, ఇబ్రహీం, రవీందర్‌రెడ్డి, రాయికల్ శ్రీను, గంగాధర్ తిలక్, హైమద్‌గోరి, దిలీప్, ప్రవీణ్, జాంగారి రవి, బచ్చలి నరేశ్, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సంక్షేమానికి కృషి

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేశంపేట, కొందుర్గు మండలాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1కోటి 36లక్షల విలువచేసే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, అదేవిధంగా 30 మంది లబ్ధిదారులకు రూ.13లక్షల 93వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

పాఠశాలలో వసతుల కల్పనకు కృషి

ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అందరం సమష్టిగా కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అధికారులు నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇబ్బందులను తీర్చేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులపై వర్క్‌షాప్

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో మంగళవారం వాతావరణ మార్పులు–అవగాహన అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇక్ఫాయ్ టెక్, పర్యావరణ క్లబ్ పరితంత్ర ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇక్ఫాయ్ వైస్ ఛాన్సలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కాలానుగుణంగా వాతావరణం వేగంగా మారుతుందని, ఇది పర్యావరణానికి పెనుముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. జాతీయ స్థాయిలో వాతావరణ మార్పులతో జరిగే ప్రభావాలు, పారిస్ అగ్రిమెంట్, అంతర్జాతీయ ఒప్పందాలకు అనుగుణంగా చేపట్టే డీకార్బనైజేషన్ చర్యల అవసరాన్ని గుర్చి హ్యూమన్ క్లైమేట్ ఇంటరాక్షన్ ఇనిషియేటివ్ చైర్‌పర్సన్ డా.సౌమిత్ర, డైరెక్టర్ రితురాజ్ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంఎటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, చీఫ్ ఎడిటర్ కరుణాకర్‌రెడ్డి, ఇక్ఫాయ్ డైరెక్టర్లు, డీన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్



మాట్లాడుతున్న డాక్టర్ అలోక్ అగర్వాల్

షాద్‌నగర్‌రూరల్: పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే ప్రతీ ఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రగతి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ అగర్వాల్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో ఉన్న ప్రగతి వెల్ఫేర్ సొసైటీలో పోషకాహార లోప నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆశవర్కర్లు, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు బరువు, ఎత్తు, కొలతతో ఏ విధంగా నిర్ధారణ చేయాలో తెలియజేశారు. అనంతరం డాక్టర్ అలోక్ అగర్వాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలకు వచ్చే విద్యార్థులకు పోషకాహార లోపాన్ని గుర్తించాలని సూచించారు. పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించి వారి ఎదుగుదలకు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు శంకర్, మురళీ, కార్తీక్, శ్రీకాంత్, తులసీ, లావణ్య, జగదీశ్, శృతి, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన

చేవెళ్ల: మైనర్లు వాహనాలు నడపకూడదని, రోడ్డు దాటే సమయంలో పాదాచారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని ట్రాఫిక్ సీఐ ఎస్.వెంకటేశం, చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో మంగళవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. పాదాచారులు జీబ్రా క్రాసింగ్ లైన్ వద్దనే రోడ్డు దాటాలని, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ రోడ్డు దాటొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు ఎట్టి పరిస్థితుల్లో నడపకూడదని, అలా నడిపితే వాహన యజమానిపై, తల్లిదండ్రులపై కూడా కేసు నమోదు అవుతుందని చెప్పారు. ద్విచక్ర వాహనాలు నడిపించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపించే వారు సీటు బెల్టులు వేసుకోవాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపటం, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకొని తల్లిదండ్రులు, ఇతరులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఎంతో అవసరమన్నారు. వీటితో కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపురెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ అశోక్, పోలీస్ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశం